బ్రాండ్ పేరుతో బురిడీ



- పేరు మార్చి మినరల్ వాటర్‌గా విక్రయం
- నాణ్యతా ప్రమాణాలకు పాతరేసిన వాటర్ ప్లాంట్ల యజమానులు
- నీటి బాటిళ్లపై కనిపించని ఐఎస్ఐ మార్కు
- ప్రజారోగ్యంతో చెలగాట మాడుతున్న వైనం

స్పెల్లింగ్ మార్చి....

మినరల్ వాటర్ బ్రాండ్ అయిన కిన్‌లే పేరు కనిపించేలా స్పెల్లింగ్ మార్చి కైన్‌లే, కాన్లే తదితర పేర్లతో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. బిసెలరీని బ్రూక్ లీన్, బిస్లీఫ్, బిస్‌లిరీ, బ్రిస్లీగా మార్చి విక్రయిస్తున్నారు. అక్వాఫినాకి బదులు ఆక్వాఫినా, ఆక్వాఫిన్,అక్వా సిగ్రేచర్ లాంటి పేర్లను వాడుతున్నారు.

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లో మినరల్ వాటర్ బాటిళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. 'మినరల్' పేరుతో వాటర్ ప్లాంట్ల యజమానులు ప్రజలకు సాధారణ నీరే విక్రయిస్తున్నారు. ప్రజలు కూడా మినరల్ వాటరే కదా అని తాగేస్తున్నారు. దుకాణాలు, హోటళ్లు, దాబాలలో సాధారణ నీటికి బదులు మినరల్ వాటర్‌నే విక్రయిస్తున్నారు. కానీ ఈ బాటిళ్లను తయారు చేసే నిర్వాహకులు ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాలను ఏ మాత్రం పాటించలేదు. రకరకాల బ్రాండ్ల పేరుతో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు.

జలుబు, గొంతు నొప్పితో అవస్థలు..

దుకాణదారులు సైతం ఈ నకిలీ బ్రాండ్లు తక్కువ ధరకే లభిస్తున్నందున వీటిని కొనుగోలు చేసి జనానికి విక్రయిస్తున్నారు. వాటర్ ప్లాంట్లు, ఇళ్ల వద్దే నీటిని విక్రయించే ఆటోలు పట్టణాలతో పాటు పల్లెల్లోనూ పెరిగాయి. ప్రజల అలవాటును గమనించి కొందరు నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. వీటిల్లో దేనికీ ఐఎస్ఐ మార్కు ఉందో లేదో తెలియని పరిస్థితి. సాధారణ నీటినే ట్యాంకర్లతో తెచ్చి మినరల్ వాటర్ అని చెప్పి ఏ మారుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విధిలేక ఈ నీటినే జనం కొనాల్సి వస్తోంది. ఫలితంగా జలుబు, గొంతునొప్పి లాంటి సమస్యలతో జనం ఇబ్బంది పడుతున్నారు.

వాటర్ ప్లాంట్ల వివరాలిలా...	
నియోజకవర్గం	వాటర్ ప్లాంట్ల వివరాలు
కళ్యాణదుర్గం	103
రాయదుర్గం	250
ఉరవకొండ	228

నిబంధనలకు నీళ్లు...

కళ్యాణదుర్గం డివిజన్‌లో 103కి పైగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటి నుంచి నీటిని క్యాన్లకు రిటైల్‌గా విక్రయిస్తున్నారు. వాటర్ ప్లాంట్లు లేకనే కొందరు బోర్లలో నీరు నింపి మినరల్ వాటర్ పేరిట విక్రయించే ట్యాంకర్లు వందకు పైగా ఉన్నాయి. నీటి నాణ్యతపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వీరు విక్రయించే నీళ్లను ప్రజలు తాగి రోగాల బారిన పడుతున్నారు. అక్రమ వాటర్ ప్లాంట్ల వ్యవహారాన్ని తేల్చాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్, ఆహార కల్తీ నిరోధక శాఖ, ఫుడ్ కంట్రోలర్‌లు, మున్సిపాలిటీ, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

వాస్తవానికి ఇలా...

మామూలుగా ఎవరైనా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలంటే తొలుత బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్)కు దరఖాస్తు చేసుకోవాలి. లేదా ఐఎస్ఐ (ఇండియన్ స్టాండర్డ్ ఇన్‌స్టిట్యూషన్) ద్వారా అనుమతి పొందాలి. ముంబై, చెన్నైలకు చెందిన ఈ సంస్థలు తమ బృందాన్ని పంపి నీటి నాణ్యతా ప్రమాణాలపై తనిఖీలు నిర్వహిస్తాయి. బోరు పాయింట్ నుంచి వచ్చే నీళ్లను ల్యాబ్‌కు పంపి, అన్ని రకాల పరీక్షలు జరుపుతారు. ఆపై అనవసర లవణాలను తీసివేసి ఆరోగ్య దాయకంగా నీటిని తయారు చేయాల్సి ఉంటుంది. అన్ని సంతృప్తికరంగా ఉంటే ఐఎస్ఐ సర్టిఫికెట్లను జారీ చేస్తుంది. అనుమతి, స్ట్రక్చర్ తదితరాలను మాత్రం సంబంధిత పంచాయతీలు, మున్సిపల్ అధికారులు పరిశీలిస్తారు. ఈ తతంగమంతా ఇక్కడి వాటర్‌ప్లాంట్లలో కనిపించదు.

ఎక్కడ చూసినా నకిలీ బాటిళ్లే



పట్టణంలో ఎక్కడ చూసినా నకిలీ నీళ్ల బాటిళ్లు కనిపిస్తున్నాయి. ఇవేం కంపెనీలు అని విక్రయించేవారిని అడిగితే ఎవరో ఏజెన్సీ వాళ్లు ఇచ్చారనే సమాధానం వస్తోంది. ఇలాంటి నీటిని తాగితే ఆరోగ్య సమస్యలు తప్పవు. దీనిపై జిల్లా ఆహార కల్తీ నిరోధక శాఖ, ఫుడ్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చొరవ చూపాలి. నీటి నాణ్యతను పరిశీలించి కల్తీ నీటి సరఫరా కాకుండా చర్యలు చేపట్టాలి.

– చల్లా కిశోర్ చౌదరి, జిల్లా వినియోగదారుల సంఘం ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు

రాధా మనోహర్‌దాస్‌పై దర్గా నిర్వాహకుల ఫిర్యాదు

రాయదుర్గంటౌన్: రాధా మనోహర్ దాస్ మత సామరస్యాన్ని దెబ్బతీసి, విద్వేషాలు రెచ్చగొట్టేలా దర్గాలపై వ్యాఖ్యలు చేయడం సరికాదని రాయదుర్గం ముస్లిం దర్గా కమిటీ నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాధా మనోహర్‌దాస్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పడుకోబెట్టిన శవం దర్గాలో ఉంటాదని, దర్గాకు వెళ్లడం దరిద్రం అంటించుకోవడమే' అని చేసిన వ్యాఖ్యలతో ముస్లింల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. దర్గా ఉత్సవాలకు ముస్లింలతోపాటు హిందూవులు కూడా హాజరై మత సామరాస్యాన్ని చాటుతారన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో హజరత్ సయ్యద్ తవక్కల్ షావలి దర్గా నిర్వాహకులు ముర్షద్‌పీరా, భంభంస్వామి దర్గా పీఠాధిపతి బషీర్ అహ్మద్, హజరత్ సయ్యద్ జాఫర్ షావలి దర్గా నిర్వాహకులు రియాజ్, ఇబ్రహీం, పీరా, ఇక్బాల్, అల్లాబకాష్, షాషావలి, ముర్షద్ ఇమ్రాన్, హజరత్ సయ్యద్ బర్కత్ షావలి దర్గా అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్, చమ్మా అస్లాం, ఖాజీ మహమ్మద్ సైపుల్లా, ఇక్బాల్, అమానుల్లా, మౌలానా ముజాహిద్ రజా, రహంతుల్లా, చమ్మా అన్వర్, నాదే అలీ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దర్గా కమిటీల నిర్వాహకులు

శిథిలావస్థలో కోట ముఖద్వారం

రాయదుర్గంటౌన్: పట్టణంలో రాయలకాలంలో నిర్మించిన కోట ముఖ ద్వారం (రాజమార్గం) శిథిలావస్థకు చేరుకొని, ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే ఎడమవైపు గోడ పూర్తిగా కూలింది. గతంలో కేంద్ర పురావస్తుశాఖ ఏపీ సర్కిల్ సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్ట్ గోపినాథ్ జేన, పురవాస్తుశాఖ సర్వే ఆఫ్ ఇండియా అసిస్టింటెంట్ అర్కియాలజిస్ట్ డీఎస్ బోయి, పురావస్తుశాఖ జిల్లా అధికారి బాలకృష్ణ కోట ముఖ ద్వారాన్ని పరిశీలించారు. నిధులు మంజూరైన వెంటనే జీర్ణోద్ధరణ చర్యలు చేపడతామని చెప్పి వెళ్లారు. దాదాపు 50 అడుగుల ఎత్తు ఉన్న కోట ప్రధాన ద్వారం రెండు వైపులా గోడలు కూలిపోయాయి.



గోడకూలి అధ్వాన స్థితిలో ఉన్న రాయదుర్గం కోట ముఖద్వారం

ఈ-క్రాప్ నమోదు గడువు పొడిగించండి



తహసీల్దార్ బాలకిషన్‌కు వినతి పత్రం అందిస్తున్న మాజీ సర్పంచ్ సరోజమ్మ

కంబదూరు: ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి ఈ–క్రాప్ నమోదుకు గడువు పొడిగించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ బాలకిషన్‌కు వారు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరోజమ్మ, వైఎస్సార్‌సీపీ నేత గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కళ్యాణదుర్గం: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న బాధిత కుటుంబాలను మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య మంగళవారం పరామర్శించారు. మండల పరిధిలోని ఎం.కొండాపురం గ్రామంలో ఆయన బాధిత కుటుంబాలను పరామర్శించారు. గ్రామానికి చెందిన మాజీ డీలర్ వెంకటేశులు, నరేష్ కుటుంబాలను పరామర్శించి, భరోసా ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, ఆత్మకూరు మధు, సోమశేఖర్, ఓబిలేశ్, సుధాకర్, రామన్న, సర్ధానప్ప, అంజి, తిరుపాల్, చంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

డిసెంబర్‌లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- హౌసింగ్ డీఈ హనుమప్ప

కూడేరు: ప్రభుత్వం తరపున మంజూరైన పక్కా ఇళ్ల నిర్మాణాలు డిసెంబర్ నెలాఖరులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ హనుమప్ప, మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ చౌదరి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో 'మన ఇల్లు–మన గౌరవం'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మొత్తం 413 గృహాలు వివిధ దశల్లో నిర్మాణం జరుగుతున్నాయన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. లేదంటే బిల్లులు ఆగిపోయి లబ్ధిదారులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. నిర్మాణాలు వేగవంతం చేయించడంలో అలసత్వం వహించొద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, హౌసింగ్ ఏఈ శేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ హనుమప్ప

హెచ్‌ఐవీపై అవగాహన

కూడేరు: స్థానిక కేజీబీవీలో హెచ్‌ఐవీపై చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ స్కీం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లింక్ వర్కర్ రాజేశ్వరి మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసై బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. హెచ్‌ఐవీ ఏవిధంగా వ్యాప్తి చెందుతుంది.. నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారిణి ఉమాదేవి, టీచర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న లింక్ వర్కర్ రాజేశ్వరి

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

ఉరవకొండ: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు కృషి చేయాలని, ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తేనే దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయశాఖ డీఆర్‌సీ, ఏడీఏ శైలజాకుమారి, మైక్రో ఇరిగేషన్ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్‌లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని షేక్షానుపల్లి, లత్తవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభించారు. ఏడీఏ శైలజాకుమారి మాట్లాడుతూ పంటల్లో సస్యరక్షణ చర్యలు, తక్కువ పెట్టుబడి అధిక దిగుబడి సాధించేందుకు సలహాలు రైతులకు కార్యక్రమం ద్వారా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ శుభకర్, హార్టికల్చర్ అధికారి నెట్టికంఠయ్య, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు.

కూడేరు: రైతులు తక్కువ పెట్టుబడితో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించేలా చైతన్య పరచడమే 'పొలం బడి' లక్ష్యమని మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ చౌదరి అన్నారు. మంగళవారం మండలంలోని కలగళ్లలో పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. సర్పంచ్ సువర్ణమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఓబుళమ్మ, ఏఓ విజయకుమార్ , వీహెచ్ఏ గిరీష్, వీఏహెచ్ఏ యశోద, ఎంపీఈఓ శ్రీలత పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే మంచి దిగుబడి

బెళుగుప్ప: రైతులు సాగు చేస్తున్న పంటల్లో సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి వస్తాయని వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్,పశు వైద్యాధికారి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని శీర్పిలో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ నిర్వహించారు. సర్పంచ్ లలితమ్మ, సచివాలయ అధికారులు హనుమంతురాయుడు, సదర్శన్ పాల్గొన్నారు.

విడపనకల్లు: మండల పరిధిలోని చీకలగురికి గ్రామంలో మండల వ్యవసాయాధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉరవకొండ ఏడీఏ పద్మజ పాల్గొని రైతులతో కలసి కంది పంటను పరిశీలించారు. కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ శైలకుమారి, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్, హార్టికల్చర్ ఆఫీసర్ నెట్టికంటయ్య, తదితర రైతులు పాల్గొన్నారు.


యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

శెట్టూరు: వ్యవసాయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించొచ్చని ఏఓ గౌరి అన్నారు. మంగళవారం మండలంలోని ములకలేడు, తిప్పనపల్లి గ్రామాల్లో ' పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లోని రైతులు సాగుచేసిన వేరుశనగ, కంది తదితర పంటను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచులు నాగరాజు, గంగన్న, ఎంపీటీసీ లింగప్ప, ఏఈఓ అంజి, ఆర్ఎస్‌కే సిబ్బంది విజయ్, లిఖిత, రైతులు పాల్గొన్నారు.

కంబదూరు: మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభమైంది.కార్యక్రమంలో భాగంగా మంగళవారం కురాకులపల్లి,చెన్నంపల్లి గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించి వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే పథకాలపై రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీ మద్దిలేటి, ఏఓ జాఫర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



షేక్షానుపల్లిలో మాట్లాడుతున్న డీఆర్‌సీ ఏడీఏ శైలజాకుమారి




కురాకులపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ మద్దిలేటి

పంటల సాగుపై అవగాహన

గుమ్మఘట్ట: రైతులు సాగు చేస్తున్న పంటలపై రైతులు అవగాహన అవసరమని ఏఓ నిర్మల్‌కుమార్ తెలిపారు. మండలంలోని 75 వీరాపురం గ్రామ సమీపంలో పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఎంపీపీ భవాని, సర్పంచ్ నాగరాజు, పశువైద్యాధికారి నవీన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే పొలంపిలుస్తోంది కార్యక్రమ లక్ష్యమని ఏఓ మధుకర్ అన్నారు. మంగళవారం మండలంలోని చాబాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు మల్లెల జగదీష్, పశువైద్యాధికారి కృష్ణమూర్తి, వీఏఏ కళ్యాణి, పశుసంవర్ధక సహాయకులు మస్తాన్,నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'అనంత హరిత'ను సద్వినియోగం చేసుకోండి



పూలచెర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ, ఇతర అధికారులు

కణేకల్లు: పొలం గట్లపై మొక్కలు పెంచుకునేందుకు 'అనంత హరిత' కార్యక్రమం ద్వారా శ్రీగంధం, ఎర్రచందనం , టేకు, సుబాబుల్ తోపాటు పలు మొక్కలను పంపిణీ చేస్తామని కణేకల్లు ఏఓ ఏ.శ్రవణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పూలచెర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రైతు పొలాలను సందర్శించిన ఏఓ పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం ఏఓ రైతులనుద్దేశించి మాట్లాడారు. 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 'అనంత హరిత' కింద మొక్కలను ఉచితంగా ఇస్తామన్నారు. ఇప్పటి వరకు 11,630 మంది రైతుల పంటలను ఈకేవైసీ చేసినట్లు ఏఓ తెలిపారు. 870 మంది రైతుల మట్టినమూనాల రిజల్ట్ పత్రాలను రైతులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది, ఎంపీఈఓలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజా సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు సమస్యలను విన్నవిస్తున్న ఎంపీపీ పెద్దన్న

బెళుగుప్ప: మండలంలోని పలు ప్రజా సమస్యలపై జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఎంపీపీ పెద్దన్న, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు వినతి పత్రం అందించారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయానికి ఆకస్మిక తనిఖీకి వచ్చిన కలెక్టర్‌కు రబీ విత్తన సాగుకు సమయం దగ్గరపడిందని, ప్రభుత్వం త్వరితగతిన సబ్సిడీ పప్పుశనగను పంపిణీ చేయాలని ఎంపీపీ కోరారు. పీహెచ్‌సీ నూతన భవనాన్ని ప్రారంభించాలని, తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చాలని విన్నవించారు. స్పందించిన కలెక్టర్.. నివేదికలను పంపాలని తహసీల్దార్ షర్మిళను ఆదేశించారు.కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్ పీరా, ఆర్ఐ నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర



అమ్మవార్ల విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో మారెమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం మారెమ్మ , కొల్లాపురమ్మ, కువ్వాడమ్మ దేవతల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, వేపచీరలు కట్టి , జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

- గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ మురళి



విద్యార్థినులకు వండిన భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ

ఉరవకొండ: విద్యార్థినులకు పౌష్టికాహారంతోపాటు రుచికరమైన భోజనం అందించి, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, లేని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ మురళి అన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలను గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి తనిఖీ చేశారు. ఈసందర్భంగా గురుకులంలో భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ మెనూ చార్టు ప్రకారం విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులు బాధ్యతల స్వీకరణ

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘం కార్యాలయంలో నలుగురు ఉద్యోగులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు ఉండగా ఒకరు జూనియర్ అసిస్టెంట్ ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్లుగా కళ్యాణదుర్గం నుంచి సత్యనారాయణ, గుంతకల్లు నుంచి వెంకటరమణ, రాయచోటి నుంచి హరిబాబు ఇక్కడికి వచ్చారు. కళ్యాణదుర్గం నుంచి జూనియర్ అసిస్టెంట్ సుశీల బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జాయినింగ్ ఆర్డర్లను మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి అందజేశారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి

ఉరవకొండ: విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని, ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ ఖాదర్ అధ్యక్షతన జరిగింది. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌లో చేరిన విద్యార్థులు చదివిన కళాశాల, సొంతూరుకు సేవ చేయాలనే తపన ఉండాలన్నారు. కాలుష్యరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ లక్ష్మీప్రసన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నేసేపేట (బీసీ–బీ) నుసికొట్టాల (ఎస్సీ,) వన్నూరుస్వామి కొండ (బీసీ–ఏ) ముదిగల్లు–1 (ఓసీ) మానిరేవు దివ్యాంగుల కోట, బ్రహ్మసముద్రం–1 (బీసీ–బీ), కణేకల్ మండలంలోని సింగనహళ్లి (వికలాంగుల కొటా,) గానిగేరి (ఎస్టీ,) హనకనహళ్లి–3 (బీసీ–బీ) కొత్తపల్లి (ఓసీ) ఇలాజి (ఓసీ) అంగన్‌వాడీ పోస్టులకు రిజర్వేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్టోబర్ 1 సాయంత్రంలోపు దరఖాస్తులు కళ్యాణదుర్గం ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని గోవిందవాడలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజా వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వంద రోజుల్లో ప్రభుత్వ చేసిన మేలు, రాబోవు రోజుల్లో అమలు చేసే పథకాలను వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ రూ.4 వేలకు పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించామన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి తిప్పేస్వామి, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓపీఆర్డీ దాస్, టీడీపీ నాయకులు వెంకటశివుడు యాదవ్, కేశవరెడ్డి, మండల కన్వీనర్ బలరామిరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థి దశ నుంచి సేవగుణాన్ని అలవర్చుకోవాలని ఎస్కే యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు తెలియజేశారు. మంగళవారం పట్టణంలోని జూనియర్ కళాశాల, ఎస్‌వీజీఎం డిగ్రీ కళాశాలలో 54వ జాతీయ సేవా దినోత్సవం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ వెంకటనాయుడు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ 1969 సెప్టెంబర్ జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శైలజరాణి, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీధర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

భూఆక్రమణలపై రెవెన్యూ అధికారులు విచారణ



ఆక్రమణకు గురైన భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కంబదూరు: భూముల కొనుగోలు పేరుతో కొందరు అక్రమార్కులు రెచ్చిపోయి వంకలు, వాగులను కబ్జా చేస్తుండడంపై 'రెచ్చిపోతున్న భూ అక్రమార్కులు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన తహసీల్దార్ బాలకిషన్ భూఅక్రమాలపై విచారణ చేపట్టారు. ఆక్రమణకు గురైన భూములను డీటీ నారాయణస్వామి,ఆర్ఐ కిరణ్‌కుమార్, సర్వేయర్ మణికాంత్, వీఆర్వో సంజీవ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం పూడ్చి వేసిన చెరువు కాలువలను జేసీబీతో తవ్వించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బెళుగుప్ప: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకవిలువలున్న ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ గంగవరం సెక్టార్ సూపర్‌వైజర్ అరుణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గంగవరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవ కార్యక్రమం సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు వరలక్ష్మి, రాధ, ఎంఎల్‌హెచ్‌పీ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.